# ఆపద మొక్కులోళ్లను నమ్మొద్దు

- ఓట్ల కోసం అంగీలు చింపుకొని వస్తరు
- వ్యక్తి కాదు.. అభివృద్ధి, సంక్షేమం ముఖ్యం
- కాంగ్రెస్‌వన్నీ దొంగ హామీలు.. ఝూటా మాటలు
- నమ్మితే గోసపడుతరు
- ధర్మపురి అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్
- మొక్కట్రావుపేట, ముత్తునూర్, రాంనూర్, చెగ్యాం, తాళ్ల కొత్తపేట, పాశిగాంలో ప్రజా ఆశీర్వాద యాత్ర


వెల్గటూర్ : మొక్కట్రావుపేటలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి, రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్, నవంబర్ 24: 'ఓట్ల కోసం అది చేస్తాం.. ఇది చేస్తామని చెబుతూ వచ్చే ఆపద మొక్కులోళ్లను నమ్మొద్దు. అంగీలు చింపుకొని కూడా వస్తరని నమ్మితే గోసపడుతరని' ధర్మపురి అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రజలకు సూచించారు. శుక్రవారం వెల్గటూర్ మండలం మొక్కట్రావుపేట, ముత్తునూర్, రాంనూర్, చెగ్యాం, తాళ్లకొత్తపేటలో ప్రజా ఆశీర్వాద యాత్ర నిర్వహించగా, ఆయా గ్రామాల్లో మహిళలు బతుకమ్మ, కోలాటాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల మంత్రి మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చేవన్నీ దొంగ హామీలేనని, చెప్పేవన్నీ ఝూటా మాటలేనని దుయ్యబట్టారు. వారి హయాంలో భూమి శిస్తూ, నీటి పన్ను, రుణాలు కట్టకపోతే ఇంటి దర్వాజలు పీక్కపోయిన చరిత్ర వారిదన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక నీటి పన్ను రద్దు చేయడమేకాదు రుణ మాఫీ చేసి ఆదుకున్న గొప్ప మనసున్న నాయకుడని కొనియాడారు. 'నేను మీ సేవకుడిని. ఆపదొస్తే ఆదుకుంటా. కష్టమొస్తే వెన్నంటి నిలుస్తా. నియోజకవర్గ ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటా. మరోసారి ఆశీర్వదించి గెలిపించాలని' ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆనాడు ఎల్లంపల్లి ప్రాజెక్టులో మొక్కట్రావుపేట గ్రామానికి సంబంధించి 97 ఇండ్లు మాత్రమే మునిగిపోతే, ప్రభుత్వంతో మాట్లాడి గ్రామాన్ని మొత్తం ముంపుగా ప్రకటించి, 413 మందికి రూ.3 లక్షల చొప్పున రూ.14.28 కోట్ల పరిహారం ఇప్పించినట్లు చెప్పారు. స్థానిక నాయకుల మీద కోపం ఉంటే స్థానిక ఎన్నికల్లో చూసుకోవాలి కానీ, ఇప్పుడు ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను చూసి కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ నాయకులు అధికారానికి దూరమై పదేండ్లు కావడంతో ఆగలేక ఆవురావురంటూ దొంగ హామీలు, ఝూటా మాటలు చెబుతున్నారని విమర్శించారు. ఊర్ల మీద పడి దోచుకోవడానికి అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. వారు అధికారంలోకి వస్తే రైతులకు 3 గంటల కరెంట్, 10 హెచ్‌పీల మోటర్లు పెడతారన్నారు. మూడు గంటలిచ్చే ఆ పార్టీ కావాలా..? 24 గంటలు ఉచిత విద్యుత్ అందించే బీఆర్‌ఎస్ కావాలా..? మీరే ఆలోచించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. త్వరలోనే మొక్కట్రావుపేట, రాంనూర్, తాళ్లకొత్తపేట, చెగ్యాం గ్రామాల్లో మిగిలిన ముప్పు సమస్యలను పరిష్కరించుకుందామని, మన తల్లీ లాంటి పార్టీ బీఆర్‌ఎస్ కా రు గుర్తుకు ఓటేసి తనను గెలిపించి, మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఇక్కడ జడ్పీటీసీ బొడ్డు సుధారాణి, ఏఎంసీ చైర్మన్ పత్తిపాక వెంకటేశ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు చల్లూరి రాంచందర్‌గౌడ్, సర్పంచ్‌లు ఆగండ్ల తిరుపతి, అనుమాల తిరుపతి, రామిళ్ల లావణ్య-సనిల్, ద్యావనపల్లి లక్ష్మి-ఎల్లయ్య, గంపల నగేశ్, ఎంపీటీసీ మూగల రాజేశ్వరి-సత్యం, గాజుల మల్లేశం, సీనియర్ నాయకులు గండ్ర రంగారావు, గండ్ర సుధీర్‌రావు, పోనుగోటి రామ్మోహన్‌రావు, గూడ రాంరెడ్డి, మాజీ సర్పంచ్ సంగ జయ-రమేశ్, మా జీ ఎంపీటీసీ కండ్లే భాగ్య, మండల యూత్ అధ్యక్షులు బిడారి తిరుపతి, కుసనపల్లి రవి, కోమటిరెడ్డి సింధూజరెడ్డి, ఎనగందుల తిరుపతి, నర్సయ్య, గౌరు తిరుపతి, అనిల్, కోల చరణ్, ధర్మాజీ సతీశ్, శ్రీను ఉన్నారు.

# ప్రతిపక్షాలతో కష్టాలే

- కాంగ్రెస్, బీజేపీలతో ప్రయోజనం శూన్యం
- వాళ్లవన్నీ ఫేక్ హామీలు.. ఏ ఒక్కటీ చేయరు
- బీఆర్‌ఎస్ రైతు, పేదల పక్షపాతి
- పనిచేసే ప్రభుత్వాన్నే గెలిపించండి
- జగిత్యాల అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్
- పలు గ్రామాల్లో విస్తృత ప్రచారం


రాయికల్ : కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న జగిత్యాల ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్

రాయికల్, నవంబర్ 24: కాంగ్రెస్, బీజేపీలను నమ్ముకుంటే మునుగుడేనని, కష్టాలు, కన్నీళ్లు తప్ప మిగిలేది ఏమీ లేదని జగిత్యాల అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ విమర్శించారు. ఎన్నికలు వచ్చాయని ఎలాగైనా గెలవాలని అన్నీ మోసపూరిత హామీలు ఇస్తున్నారని, ఏ ఒక్కటీ చేయరని నమ్మితే మోసపోతారన్నారు. రాయికల్ మండలం కురుమపల్లి, శ్రీరామ్‌నగర్, సింగర్రావుపేట, అల్లీపూర్, కిష్టంపేట గ్రామాల్లో శుక్రవారం బీఆర్‌ఎస్ జగిత్యాల అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్ ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ అంటేనే రైతు, పేదల పక్షపాతి ప్రభుత్వమని, నిరంతరం రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం గురించి ఆలోచించే పార్టీనే గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పదేండ్ల క్రితం జగిత్యాల నియోజకవర్గం ఎలా ఉండె..? ఇప్పుడెట్ల ఉందో..?, పల్లెలు ఎంత అభివృద్ధి చెందాయో..? ఆలోచించాలని సూచించారు. గత ప్రభుత్వాలు పేదలు, రైతుల కోసం చేసిందేమీలేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ పేదలు, రైతుల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టారని చెప్పారు. ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ సర్కార్ పెన్షన్లను పెంచుతామని, డబుల్ బెడ్రూం ఇండ్లు, దళిత, బీసీ బంధును అర్హులందరికీ అందిస్తామన్నారు. అర్హులైన మహిళలందరికీ సౌభాగ్య లక్ష్మి పథకం ద్వారా నెలకు రూ.3వేలు అందిస్తామని, సిలిండర్ ధరను రూ.400కే అందిస్తామన్నారు. ఒకప్పుడు రైతులు కరెంటు, ఎరువులు, విత్తనాల కోసం ఎన్నో ఇబ్బందులు పడ్డారని, కానీ రాష్ట్రంలో నేడు ఆ పరిస్థితి లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వడ్లు కొనమంటే రైతుల పక్షాన ఢిల్లీకి వెళ్లి ధర్నాలు చేసిన ఘనత బీఆర్‌ఎస్‌దని కొనియాడారు. కాంగ్రెస్, బీజేపీని నమ్మితే ప్రజలకు కష్టాలు తప్పవన్నారు. మూడు పంటలు పండేలా కరెంట్, నీళ్లు ఇస్తున్న సీఎం కేసీఆర్ కావాలా..? మూడు గంటల కరంటు చాలంటున్న కాంగ్రెస్ కావాలా..?, మీటర్లు పెట్టే బీజేపీ కావాలా..? మీరే ఆలోచించుకోవాలని ప్రజలకు సూచించారు. రాష్ట్రంలో పుట్టిన పిల్లవాడి నుంచి ముసలివాడి దాకా సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని చెప్పారు. కురుమపల్లి, శ్రీరామ్ నగర్ గ్రామాల్లో రేషన్ షాపులను ఏర్పాటు చేసి ప్రజలకు సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తామని చెప్పారు. కిష్టంపేట మీదుగా ఆర్టీసీ బస్సును నడిపిస్తామని, కిష్టంపేట నుంచి జగిత్యాల రోడ్డును సైతం వేయిస్తానని వివరించారు. విద్య, వైద్యానికి తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చిందని, అందులో భాగంగానే రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ గురుకులాలను వందల సంఖ్యలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి జిల్లాకు మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయడంతో పాటు ప్రజలకు ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని వివరించారు. అల్లీపూర్ మండలం చేసేందుకు అన్ని అర్హతలు ఉన్నాయని, మళ్లీ గెలిచిన తర్వాత వెంటనే ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. ఒక వైద్యుడిగా, ఎమ్మెల్యేగా నిత్యం ప్రజల మధ్యలో ఉండి సేవ చేస్తున్న తనను వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇక్కడ జడ్పీటీసీ సభ్యురాలు జాదవ్ అశ్విని, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కోల శ్రీనివాస్, సర్పంచులు సులత, స్వరూపగోపి, రాజమౌళి, రాంచందర్‌రావు, ఎంపీటీసీ సభ్యులు మోర విజయలక్ష్మీవెంకటేశ్, సాగరిక, ఏఎంసీ వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్ ఉన్నారు.


సీఎం సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ ఎల్ రమణ, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

# 26న జగిత్యాలకు బీఆర్‌ఎస్ అధినేత

- జగిత్యాల గీత విద్యాలయం మైదానంలో ప్రజాఆశీర్వాద సభ
- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్సీ ఎల్ రమణ, జడ్పీ చైర్‌పర్సన్

జగిత్యాల కలెక్టరేట్, నవంబర్ 24: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం జగిత్యాలలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభకు బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ రాబోతున్నారు. నియోజకవర్గ కేంద్రం జగిత్యాలలోని గీత విద్యాలయం మైదానంలో సభ నిర్వహించనుండగా, ఏర్పాట్లను ఎమ్మెల్సీ, జగిత్యాల అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జి ఎల్ రమణ, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత శుక్రవారం పరిశీలించారు. ఇక్కడ బీఆర్‌ఎస్ జగిత్యాల రూరల్ మండలాధ్యక్షుడు బాలముకుందం, ప్యాక్స్ చైర్మన్లు మహిపాల్‌రెడ్డి, సందీప్‌రావు, నాయకులు దావ సురేష్, నక్కల రవిందర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, రాంమోహన్‌రావు, ఆసీఫ్, శరత్, ఉత్తమ్, సుమన్‌రావు ఉన్నారు.

# వాళ్లు ఎన్నికల టూరిస్టులు

- ఐదేండ్లకోసారి వచ్చిపోతారు.. • నమ్మితే మోసపోవడం ఖాయం
- చేసేది చెప్పకుండా ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నరు
- బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల


మెట్‌పల్లి రూరల్ : చౌలమద్దిలో బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్లను ఆప్యాయంగా దగ్గరకు తీసుకుంటున్న వృద్ధురాలు

మెట్‌పల్లి రూరల్, నవంబర్ 24: ''ఐదేళ్లకోసారి గ్రామాలకు వచ్చిపోయేవాళ్లు ఎన్నికల టూరిస్టులు. ఏం చేస్తారో చెప్పకుండా మాయమాటలు చెప్పి, మోసం చేస్తున్నరు. ప్రజలను రెచ్చగొట్టి ఓట్లు దండుకోవాలని పెద్ద స్కెచ్చే వేస్తున్నరు. అలాంటి వారిని నమ్మితే మోసపోతరు. జాగ్రత్త అంటూ' బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ప్రజలకు పిలుపునిచ్చారు. తానొక్కటే అడుగుతున్నానని, ప్రజల మధ్య చిచ్చుపెట్టి, లబ్ధి పొందేవాళ్లు కావాలా..? ప్రతిరోజూ ప్రజల మధ్యే ఉంటూ పనిచేసే నాయకులు కావాలా..? ఓటర్లు ఆలోచించుకోవాలని సూచించారు. ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులకు కేవలం ఎన్నికల సమయంలోనే ప్రజలు గుర్తుకు వస్తారని, వారికి ప్రజా సంక్షేమంపై చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. శుక్రవారం మెట్‌పల్లి మండలం చౌలమద్దిలో ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్‌షో నిర్వహించగా, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంజయ్ మాట్లాడారు. దేశంలోని 16 రాష్ట్రాల్లో మహిళలు బీడీలు చేస్తారని, కానీ బీడీ కార్మికులకు పింఛన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ ఒక్కటేనని వెల్లడించారు. పదేళ్లలో కేసీఆర్ ఏమీ చేయలేదని, 24 గంటల కరెంట్ ఇవ్వడం లేదని మాట్లాడే ప్రతిపక్ష పార్టీల నాయకులను మీ గ్రామాల్లోని కరెంటు తీగలు పట్టుకొమ్మని చెప్పాలని ఎద్దేవా చేశారు. కేసీఆర్ వచ్చాకనే 24 గంటల కరెంటు, రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్టు, ఆసరా పింఛన్లు వంటి సంక్షేమ పథకాలు అమలువుతున్నాయని తెలిపారు. ఇన్ని సంక్షేమ ఫలాలు ప్రజలకు అందుతున్నా, పట్టింపు లేని ప్రతిపక్షాలు ఇక్కడ వంతెన నిర్మాణం పూర్తికాలేదని ప్రజలను రెచ్చగొడుతున్నాయని వివరించారు. కాంట్రాక్టర్ల అలసత్వం, అసమర్థత వల్లే చౌలమద్ది వాగుపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణంలో జాప్యం నెలకొందని పేర్కొన్నారు. నిర్దేశిత సమయంలో పనులు చేయకపోవడంతో కాంట్రాక్టర్‌ను సైతం ప్రభుత్వం బ్లాక్‌లిస్టులో పెట్టిందన్నారు. పనులను మరో కాంట్రాక్టర్‌కు అప్పగించామని, త్వరలోనే వంతెన నిర్మాణం పూర్తవుతుందని హామీనిచ్చారు. కారు గుర్తుకు ఓటేసి మరోసారి తనను ఆశీర్వదించాలని కోరారు. ఇక్కడ ఎంపీపీ మారు సాయిరెడ్డి, సర్పంచ్ గడ్డం లింగారెడ్డి, సహకార సంఘం అధ్యక్షుడు తీగల లింగారెడ్డి, రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు గడ్డం రాంరెడ్డి, నాయకులు మాదం నర్సిరాజం, రేగుంట రాజు, రాజేశ్వర్ పాల్గొన్నారు.